నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

మణికొండ: కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం గురువారం మైలార్‌దేవ్‌పల్లిలోని దుర్గా కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మున్సిపాలిటీలు, మండలాల కార్యకర్తలంతా హాజరు కావాలని కోరారు. కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రాజేంద్రనగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉప్పర్‌పల్లి పిల్లర్ నంబర్ 178 వద్ద బుధవారం సాయంత్రం 50 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు స్థానికంగా భిక్షాటన చేసేవాడని పోలీసుల విచారణలో తెలిసింది. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

నేడు 'మనూ' ఆధ్వర్యంలో యూనిసెఫ్ మీడియా కన్సల్టేషన్

రాయదుర్గం: రోడ్డు భద్రత, వ్యవస్థల బలోపేతంపై యూనిసెఫ్ మీడియా కన్సల్టేషన్ సమావేశాన్ని గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంసీజే విభాగం డీన్ ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్ తెలిపారు. గురువారం వర్సిటీలోని మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగం, యూనిసెఫ్, ఇండియా సహకారంతో ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ ప్రత్యేక ఉపన్యాసం చేయనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా యూనిసెఫ్ ఇండియా చీఫ్ కమ్యూనికేషన్, పార్టనర్‌షిప్స్ చీఫ్ జాఫ్రిన్ చౌదరీ, ఐఎస్‌ఏడీఏకే సీఈఓ రోమన్‌చెసా, యూనిసెఫ్ హైదరాబాద్ చీఫ్ డాక్టర్ జెలాలెమ్ టాఫెస్సె, ఎన్‌హెచ్‌ఏఐ హైదరాబాద్ రీజనల్ ఆఫీసర్ శివశంకర్, రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ యూనిసెఫ్ ఇండియా కంట్రీ ఆఫీస్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ సయ్యద్ హబ్బీ అలీ తదితరులు పాల్గొననున్నట్లు ఆయన వివరించారు.

టీఈసీలో హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు అవకాశం

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్(టీఈసీ)లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌కు అవకాశం దక్కింది. కమిషన్‌లోని పాఠశాల విద్యా, నాణ్యతపై వర్కింగ్ గ్రూప్ సభ్యుడిగా హెచ్‌సీయూ ప్రొఫెసర్ నాగరాజు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లోని సోషియాలజీ విభాగం అధిపతిగా పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విద్యా విధానాన్ని రూపొందించేందుకు టీఈసీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కమిషన్‌కు అవసరమైన సంస్కరణలపై అధ్యయనం, సిఫార్సులను చేసేందుకు వర్కింగ్ గ్రూప్ లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా పాఠశాల విద్యలో నాణ్యతను మెరుగుపరిచేందుకు, సమస్యలను గుర్తించి సంస్కరణలను సూచించేందుకు ఏర్పాటు చేసిన గ్రూప్‌లో ప్రొఫెసర్ నాగరాజుకు అవకాశం కల్పించారు. ఈ బృందంలో ఇప్పటికే హెచ్‌సీయూ విశ్రాంత ప్రొఫెసర్ శాంతాసిన్హా, టీఐఎస్ఎస్ ప్రొఫెసర్ రేఖపప్పు ఎస్‌సీఈఆర్‌టీ హైదరాబాద్ మాజీ డైరెక్టర్, బి శేషుకుమారి ఉన్నారు. వీరందరూ గతంలో హెచ్‌సీయూతో అనుబంధం కలిగి ఉన్న వారే కావడం విశేషం.

పార్కులో పాగాకు చెక్!

- కోర్టులో కేసు ఉండగానే ఆక్రమణలు
- పోలీసు బందోబస్తు నడుమ తొలగింపు
- మణికొండ మున్సిపల్ అధికారులతో కబ్జాదారుల వాగ్వాదం
- ఓ కాలనీ లేఅవుట్‌తో మరో కాలనీలో కబ్జా
- తొలగింపు సందర్భంగా స్వల్ప ఉద్రిక్తత



ఆక్రమణలను తొలగించిన మున్సిపల్ సిబ్బంది



పార్కు స్థలంగా పేర్కొంటూ ఏర్పాటు చేసిన బోర్డు

మణికొండ: ఒక లే అవుట్‌లో పార్కు కొరకు వదలిన భూమిని పక్క లే అవుట్‌లో స్థలాలు కొన్న వారు తమ ప్లాట్లుగా పేర్కొంటూ ఏర్పాటు చేసిన ప్రహరీని మున్సిపాలిటీ అధికారులు తొలగించారు. సదరు పార్కు విషయం ఇప్పటికే రాష్ట్ర హైకోర్టులో వివాదం కొనసాగుతున్నా వాటిని పట్టించుకోకుండా ఏకంగా అందులో 800 గజాల స్థలానికి కొందరు ప్రబుద్ధులు ఎసరు పెట్టారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు వారు ఏర్పాటు చేసిన ప్రహరీని తొలగించి కబ్జా చెర విడిపించారు. వివరాలివీ... మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని తిరుమల హిల్స్ కాలనీ, పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 87, 119లలో 17.36 ఎకరాల విస్తీర్ణంలో 1990లో అప్పటి హైదరాబాద్ నగరాభివృద్ధి సంస్థ (హుడా) 10132/ఎంపీ2/హుడా/1990 ప్రకారం లేఅవుట్ అనుమతులు జారీ చేసింది. అందులో 8,633 గజాల పార్కుల భూమి అప్పటి గ్రామ పంచాయతీకి రియల్టర్‌లు 1993 సంవత్సరంలో గిఫ్ట్ డీడ్ చేశారు. అక్కడివరకు సజావుగా ఉన్నా... లేఅవుట్ చేయగా మిగిలిన మరి కొంత భూమిలో 2008 సంవత్సరంలో ఆజిల్ బిల్డ్‌కాన్ కాలనీగా మరో లేవుట్ జారీ చేశారు. రెండవ లే అవుట్‌లో అదనపు భూమి చూపటం, అది అప్పటికే తిరుమల హిల్స్ కాలనీ లేఅవుట్‌లో ఉండటంతో కొంత భాగం తొలగించి లేఅవుట్ మంజూరు చేశారు.

పక్క కాలనీ పార్కులో పనులు...

రెండవ సారి మంజూరైన లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు తమ ప్లాట్లు ఇక్కడే వస్తాయని తిరుమలహిల్స్ కాలనీ పార్కు స్థలంలో వారం రోజులుగా ప్రహరీ నిర్మాణ పనులను చేపట్టారు. ఏకంగా 800 గజాల స్థలానికి చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేశారు. సదరు స్థలం విషయంలో ఇప్పటికే రాష్ట్ర హైకోర్టులో కేసు కొనసాగుతోంది. అది పార్కు స్థలమని కాలనీ వాసులు, కాదు తమ ప్లాట్లని కొందరు కోర్టును ఆశ్రయించారు. అందులో మున్సిపాలిటీ అధికారులు ఇంప్లీడ్ అయి పోరాటం చేస్తున్నారు.

☛ ఇదిలా ఉండగా పక్క కాలనీలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు తమ స్థలంగా పనులు చేపట్టడంతో బుధవారం మణికొండ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్‌సింగ్ ఆధ్వర్యంలో నార్సింగి పోలీసుల బందోబస్తు మధ్య సిబ్బంది వాటిని తొలగించారు. ఈ సందర్భంగా టీపీఓ మాట్లాడుతూ... టైటిల్, స్థలం విషయం కోర్టులో ఉందని, అది తేలే వరకు అందులో ఎవరూ ఎలాంటి పనులు చేపట్టరాదన్నారు. రాబోయే రోజుల్లోనూ ఎలాంటి పనులు చేపట్టినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

☛ ప్రహరీ తొలగించే క్రమంలో ప్లాట్ల యజమానులు, టీపీఓకు మధ్య వాగ్వాదం కొనసాగింది. అయినా అవేమీ పట్టించుకోకుండా ఆక్రమణను తొలగించి మున్సిపాలిటీ స్థలంగా, హైడ్రా ఆధ్వర్యంలో సంరక్షించినట్టుగా బోర్డులు ఏర్పాటు చేశారు.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం



రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ దేశానికి చేసని సేవలు ఎంతో గొప్పవని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎన్.ధనుంజయ్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే స్థానికంగా ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేస్తూ కొనియాడారు. పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్‌రెడ్డి, నాయకులు సామ ఇంద్రపాల్‌రెడ్డి, బి-బ్లాక్ అధ్యక్షుడు మొహమ్మద్ ఖాలేద్, డివిజన్ అధ్యక్షుడు మొహమ్మద్ ఇస్మాయిల్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, నేతలు పలుగు చెరువు మహేష్, రగడంపల్లి శ్రావణ్, అనుముల జాన్‌పాల్, లక్ష్మారెడ్డి, షేక్ ఫైన్, జాంగీర్‌ఖాన్, ప్రశాంత్, భరత్‌రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి

మణికొండ: మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా నార్సింగి మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్ మాట్లాడుతూ... దేశానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలు అమోఘమని, ఆయన ఆధ్వర్యంలోనే దేశంలో ఐటీ రంగ విప్లవం వచ్చిందన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి ఆయన పెద్ద పీట వేయటంతోనే అందులో లక్షలాదిగా ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఆయన మార్గదర్శకంలో కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు డి.కిరణ్, రాము, వినోద్‌కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్తాపూర్‌లో...

అత్తాపూర్: రాజీవ్ గాంధీ వర్ధంతిని అత్తాపూర్ డివిజన్‌లో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు జి.ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నేతలు కొండకళ్ల నాగేందర్‌రెడ్డి, గోవర్ధన్, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు గొంది ప్రవీణ్‌రెడ్డి, మహేందర్, రవీందర్, కృష్ణమూర్తి, సురేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ తదితరులు

విద్యార్థులకు ఆసక్తికరంగా బోధించాలి

అత్తాపూర్: ఆడుతూ పాడుతూ ప్రైమరీ విద్యార్థులకు తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించాల్సిన అవసరం ఉందని ఎంతైనా రాజేంద్రనగర్ మండల విద్యాధికారి కేశవత్ శంకర్ రాథోడ్ అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీసేందుకు సమగ్ర శిశు ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఇన్ సర్వీసింగ్ రెండవ రోజు అత్తాపూర్‌లో ఉన్న ఎడిఫై వరల్డ్ స్కూల్‌లో జరిగింది. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఆడుతూ పాడుతూ ఉపాధ్యాయులకు పాఠాలు చెప్పారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను స్వచ్ఛంద సంస్థ పాఠశాల అభివృద్ధిలో భాగం చేసుకోవాల్సిన బాధ్యత గురువులపై ఉందన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల ప్రలోభాలు వారు చెప్పే మాటలను నమ్మవద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులపై వస్తున్న ఆరోపణలను స్థానిక పాఠశాలలో చైర్మన్‌లతో ఎప్పటికి అప్పుడు సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు సవాళ్లుగా తీసుకొని ముందుకు వెళితే వందశాతం ఫలితాలు మనవైపే ఉంటాయని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. గణిత శాస్త్రంలో శిక్షణ ఉపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, మాతృభాష తెలుగులో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు రోహిణి, ఇంగ్లిష్‌లో శిక్షణ పొందిన ఉపాధ్యాయుడు అనిల్, ఈవీఎస్‌లో శిక్షణ పొందిన మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. ఆయా పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకొని ప్రగతి బాటలో పయనించాలని ఆయన పిలుపునిచ్చారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల మంజూరైన 16 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బుధవారం ఆయన నివాసంలో మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ గృహాలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, కొత్త రేషన్ కార్డులను అర్హులైన వారందరికీ అందజేస్తుందన్నారు. ఆయా పథకాలకు అర్హత ఉన్న వారు వాటిని పొందాలన్నారు. రాబోయే రోజుల్లోనూ మరిన్ని పథకాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. వాటికి సకాలంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ గృహాలు మంజూరైన లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాటిని నిర్మించుకోవాలన్నారు. అధికారులు వారికి సకాలంలో డబ్బు మంజూరు అయ్యేందుకు కృషి చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, మేనేజర్ శ్రీధర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పార్కింగ్ పరేషాన్

శాస్త్రిపురం: వాణిజ్య ప్రాంతాలు ఎక్కువగా ఉండే సులేమాన్‌నగర్, శాస్త్రిపురం అత్తాపూర్, చింతల్‌మెట్, హైదర్‌గూడ, హసన్‌నగర్ ప్రాంతాలలో పార్కింగ్ స్థలం లేక రోడ్లపైనే వాహనాలు నిలపాల్సి వస్తోంది. ఆయా ప్రాంతాలలో సాయంత్రం, రాత్రి వేళలో రహదారులపైన వాహనాల పార్కింగ్ కారణంగా ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. పార్కింగ్ స్థలాలను చూపించాలని ఆటోవాలాలు ఏళ్ల తరబడి అధికారులను కోరుతున్నా ఫలితం లేదురు. ముఖ్యంగా వ్యాపార సముదాయాలు, హోటళ్లు, జనరల్ స్టోర్‌లకు పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో వాహనాలను రోడ్లపైనే ఆపాల్సి వస్తోందని పలువురు వాహనదారులు చెబుతున్నారు. చింతల్‌మెట్ నుంచి బహదూర్‌పురా వైపు వెళ్లే ప్రధాన రహదారిపైనే ఆటోలను గంటల తరబడి నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. చాలా మంది తమ భారీ వాహనాలకు పార్కింగ్ లేకపోవడంతో ప్రధాన రహదారుల పక్కనే రోజుల తరబడి పార్కింగ్ చేస్తున్నారు. దీంతో అర్ధరాత్రి వేళ వాహనాల నుంచి బ్యాటరీలను దొంగలు ఎత్తుకు వెళ్తున్నారని పలువురు డ్రైవర్లు వాపోతున్నారు. వాహనాల పార్కింగ్‌కు తగిన స్థలాలను చూపించాలని వాహనదారులు కోరుతున్నారు.



చింతల్‌మెట్ ప్రధాన రహదారి పక్కన పార్కింగ్ చేసిన వాహనాలు

వేడుకగా నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



గోపూజ నిర్వహిస్తున్న భక్తులు



అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

అత్తాపూర్: హైదర్‌గూడలోని నల్ల పోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపత్సవాలు వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ బుధవారం ప్రారంభమయ్యాయి. బాబు జగ్జీవన్‌రామ్ యూత్ అసోసియేషన్ సభ్యులు, ప్రణవ భక్త సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మహోత్సవాలను కనుల పండువగా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ప్రతిష్ఠాపనోత్సవాలో భాగంగా బుధవారం ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, మాతృకపూజ, గోపూజ, పంచగవ్యప్రసన్యం దీక్షారాధన, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం అనంతరం అమ్మవారి విగ్రహ ఊరేగింపు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ ఏర్పాట్లు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చిరు జల్లులతో ఉపశమనం

శాస్త్రిపురం: వేసవిలో భానుడి ప్రకోపానికి ఇబ్బందులు పడ్డ ప్రజలకు బుధవారం కురిసిన చిరుజల్లులతో ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన జల్లుల కారణంగా రోడ్లన్నీ జలమయమయ్యాయి. శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌లోని పలుప్రాంతాలలో వాహనాల రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అపార్ట్‌మెంట్లు, ఇళ్ల ముందు వర్షపు నీరు వచ్చి చేరింది. ఆయా ప్రాంతాలలోని రోడ్లు మొత్తం జలమయ్యి, బురదమయం కావడంతో ట్రాఫిక్ స్తంభించింది. మరోవైపు డ్రైనేజీలు పొంగి పొర్లుతూ ఉండటంతో ఆ ప్రాంతాలు దుర్గంధ భరితంగా మారాయి. పలు చోట్ల మ్యాన్‌హోళ్ల మూతలు ధ్వంసం కావడం, పాదచారులు ఎక్కడ ఏ మ్యాన్‌హోల్‌లో పడతామోనని ఆందోళనకు గురవుతూ రాకపోకలు సాగించారు. చింతల్‌మెట్, నౌనంబర్, ఎం.ఎం.పహాడీ, బాసిత్‌బాబానగర్, సిక్‌చావనీ, సులేమాన్ నగర్, వాదియామహ్మద్ ప్రాంతాల ప్రజలు వర్షం కారణంగా ఇబ్బందులకు గురయ్యారు.



సులేమాన్‌నగర్‌లో కురుస్తున్న వర్షం

సమస్యలు తెలుసుకునేందుకే 'బస్తీ బాట'



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే 'బస్తీబాట' చేపడుతున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్న ఆయనను వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు బుధవారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో రూ.292 కోట్లతో అధునాతన డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, అబిన్ చౌస్ తదితరులున్నారు.

చెత్త శుద్ధి ఇలాగేనా?

ఇంట్లో సేకరించిన చెత్తను ఊరి బయట రోడ్డు పక్కన పారబోస్తున్నారు. ఇంటింటి చెత్త సేకరణ చేపట్టి డంపింగ్ యార్డుకు తీసుకెళ్లాల్సి ఉండగా.. ఇలా రోడ్ల పక్కన పారేసి.. నిప్పుతో తగలబెట్టి చేతులు దులుపుకొంటున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చివేస్తుండటంతో కాలుష్యం ఊరి మీదకు వచ్చి జనం ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడంతో గ్రామాల్లో చెత్త సేకరణ అస్తవ్యస్తంగా మారింది.

– శంషాబాద్ రూరల్



పెద్దషాపూర్ గ్రామంలో రోడ్డు పక్కన పారబోసిన చెత్త

సేవలు సరే.. పోస్టులెక్కడ..?

- నర్క్యూడ పీహెచ్‌సీలో పోస్టుల మంజూరులో జాప్యం
- దశాబ్దకాలంగా డిప్యుటేషన్‌పైనే సిబ్బంది విధులు
- పెద్దషాపూర్ పీహెచ్‌సీకి జనరేటర్ సమకూరేనా?

శంషాబాద్ రూరల్: ఆస్పత్రి ఏర్పాటు చేసి దశాబ్దం గడిచింది. అవసరమైన సిబ్బంది పోస్టుల మంజూరుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇతర ఆస్పత్రుల నుంచి డిప్యుటేషన్‌పై వైద్యులు, వైద్య సిబ్బంది ఇక్కడ సేవలు అందిస్తున్నారు. మండలంలోని నర్క్యూడ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో నెలకొన్న వింత పరిస్థితి. సబ్ సెంటర్లలో సైతం డాక్టర్ల పోస్టులు ఖాళీ ఉన్నాయి. నర్క్యూడ పీహెచ్‌సీతో పాటు దీని పరిధిలో ఐదు సబ్ సెంటర్లు ఉన్నాయి. పీహెచ్‌సీలో రోజూ 70 మంది వరకు రోగులు చికిత్స కోసం వస్తుంటారు. సబ్ సెంటర్లలో వారానికి రెండు రోజులు టీకాలు వేస్తుంటారు. దీంతో పాటు బీపీ, షుగర్ వంటి సాధారణ వైద్య సేవలు అందజేస్తారు.

సొంత భవనాలు కరువు...

వైద్య ఉప కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సిద్ధంతి, శంషాబాద్, కొత్వాల్‌గూడ, మల్కారం, తొండుపల్లి, పాల్మాకుల, పెద్దగోల్కొండ, గొల్లపల్లిలో ఉన్న సబ్ సెంటర్లను కమ్యూనిటీ, అంగన్‌వాడీ భవనాల్లో కొనసాగిస్తున్నారు. ఇక ఆయా సబ్ సెంటర్లకు ఆయూష్ వైద్యులను నియమించగా.. సిద్ధంతి, మల్కారం, నర్క్యూడలో ఈ పోస్టులు ఖాళీ ఉన్నాయి.



నర్క్యూడ పీహెచ్‌సీ భవనం

పోస్టుల మంజూరులో తీవ్ర జాప్యం...

పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌తో పాటు సూపర్‌వైజర్, ఏఎన్ఎం, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు పోస్టుల మంజూరు ఇప్పటి కాలేదు. దీంతో ఇతర ఆస్పత్రుల నుంచి సిబ్బంది ఇక్కడ డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ 24 గంటల వైద్య సేవలకు సరిపడా మౌలిక వసతులు ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు.

కుక్కకాటు బాధితులే ఎక్కువే...

నర్క్యూడ, పెద్దషాపూర్ పీహెచ్‌సీలకు కుక్కకాటు బాధితులు క్యూ కడుతున్నారు. వారంలో పది మంది బాధితులు టీకాల కోసం ఆస్పత్రులకు వస్తున్నారు. గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువ కావడంతో చిన్నారులు సైతం వీటి కాటుకు గురవుతున్నారు.

జనరేటర్ సౌకర్యం లేక...

పెద్దషాపూర్ పీహెచ్‌సీలో జనరేటర్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫ్రీజర్లలో వ్యాక్సిన్‌ను భద్రపర్చడానికి కరెంటు సరఫరా నిలిచిపోతే సమస్యలు తప్పడంలేదు. ఇక్కడ జనరేటర్ లేదా ఇన్వర్టర్ సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉంది.



నర్క్యూడ పీహెచ్‌సీలో రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం



పీహెచ్‌సీలో పోస్టుల మంజూరు కాకపోవడంతో అందరం ఇక్కడ డిప్యుటేషన్‌పైనే విధులు నిర్వహిస్తున్నాం. రోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వైద్య సేవలు అందిస్తున్నాం.

– దివ్యశ్రీ, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ, నర్క్యూడ

జనరేటర్ ఏర్పాటుకు కృషి



ఇక్కడ జనరేటర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. వ్యాక్సిన్ భద్రపర్చడానికి విద్యుత్ అవసరం చాలా ఉంది. కొన్ని గంటల పాటు కరెంటు లేకున్నా ఇబ్బంది ఉండదు. జనరేటర్ ఉంటేనే చాలా బాగుంటుంది.

– శ్రీదేవి, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ, పెద్దషాపూర్